క్లుప్తంగా

నేటి నుంచి వెంకటాచల స్వామి కల్యాణోత్సవాలు

గూడూరు: ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటాచలస్వామి దివ్య బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.వి.వి.మోహనరావు తెలిపారు. గురువారం స్వామి వార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసిపూజలు నిర్వహిస్తామన్నారు.

ఉపాధి హామీ పనులకు శ్రీకారం

గూడూరు:మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులకు సర్పంచ్ లింగం సులోచనారాణి భూమి పూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూడికతీత ద్వారా చివరి భూములకు కూడా సక్రమంగా సాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం విజయ్ పాల్గొన్నారు.

పాండురంగడి గుడిలో గోశాల ప్రారంభం

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన గోశాలను ఆలయ నిర్వాహకుడు టేకి నరసింహం బుధవారం ప్రారంభించారు. గోసంరక్షణార్థం చిలకలపూడికి చెందిన స్వర్గీయ తోట సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు గోశాలను ఆలయ ప్రాంగణంలో నిర్మించారు. అన్న ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొల్లు నుంచి శ్రీశైలం సైకిల్ యాత్ర

పెడన: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి కర్నూలు జిల్లా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి సైకిల్‌పై యాత్ర చేపట్టిన వ్యక్తులను ఆర్యవైశ్య ప్రముఖులు అభినందించారు. పాలకొల్లు నుంచి బయలు దేరిన మరుదురి నరసింహాచార్యులు, బాణాల సాయికుమార్‌లు సైకిల్‌పై వెళుతుండగా బుధవారం ఉదయం పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, అఖిల భారత ఆర్యవైశ్య పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టరు కొల్లూరి చిన్న వారిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి ప్రయాణ వివరాలు తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి వారికి పండ్లు, కొబ్బరినీళ్ళు, మచిలీపట్నంలో భోజన వసతి ఏర్పాటు చేశారు.

విజిలెన్స్ దాడుల్లో అపరాధ రుసుం వసూలు

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్తు వినియోగదారులపై విద్యుత్తు శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించి రూ. 10,55,400 అపరాధ రుసులు వసూలు చేసినట్లు ఏఈ రవికుమార్ తెలిపారు. జిల్లా విజిలెన్స్, మచిలీపట్నం ఆపరేషన్స్ ఈఈలు సీహెచ్ వాసు, జి.గోవిందరావు ఆధ్వర్యంలో 34 బృందాలు 1948 గృహ, వాణిజ్య 253, పరిశ్రమ 8, ఆక్వా 143 చెందిన సర్వీసులను తనిఖీ చేశారు. వీరిలో అదనపు లోడు వినియోగిస్తున్న వినియోగదారులకు జరిమానా విధించామని చెప్పారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఈఈ మాట్లాడుతూ 50 శాతం రాయితీపై జూన్ 30వ తేదీలోగా వినియోగదారులు అదనపు లోడును క్రమబద్ధీకరించాలని సూచించారు. మచిలీపట్నం, పామర్రు, పెడన సబ్ డివిజన్ డీఈఈలు, ఏఈఈలు, ఎల్ఐలు పాల్గొన్నారు.

అదృశ్యమైన సతీష్ ఆచూకీ లభ్యం

చల్లపల్లి:అదృశ్యమై అందరినీ ముప్పుతిప్పలు పెట్టిన కైతేపల్లి సతీష్ ఆచూకీ ఎట్టకేలకు తెలిసింది. గ్రామంలో అందరూ ఆందోళన చెందుతున్న సమయంలో తాపీగా పక్క ఇంట్లో నుంచి బయటకు వచ్చి అందరికీ షాక్ ఇచ్చాడు. మంగళాపురం ఎస్సీ కాలనీకి చెందిన 20 ఏళ్ళ సతీష్ అదే గ్రామంలోని చంద్ర ఆనంద్ విశ్వమోహన్ ఇంట్లో పని చేసుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయాన్ని సతీష్ కుటుంబ సభ్యులకు చెప్పటంతో వారు చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండో రోజు చల్లపల్లి-మచిలీపట్నం ప్రధాన రహదారిపై ధర్నా చేయటం, పోలీసులు కేసు కట్టి రంగంలోకి దిగి గాలించటం అంతా చకచకా జరిగిపోయాయి. ఆనంద్ విశ్వమోహన్ ఇంటిపక్కన ఖాళీగా ఉన్న మరో ఇంట్లో దాక్కొన్నానని సతీష్ చెప్పాడు. డాబాపైకి వెళ్లి మామిడికాయలు తిని కడుపు నింపుకున్నానని తెలిపాడు.

ఆర్ఎంపీ వైద్యుల సేవలు మరువలేనివి

బంటుమిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ వైద్యుల సేవలు మరువలేనివని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు అన్నారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాగిత అభినందన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు పేదలకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్యం అందించి ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు కలిదిండి రాజు, మునిపెడ రాజు, వై. కొండ, రజనీకాంత్, ఓ. తులసీ రావు, ఉయ్యూరు సంఘం అధ్యక్షుడు రాంబాబు, బషీర్ బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వెతలు తీరేనా?

- నదుపాయాలు కరువై అవస్థలు
- వేలాది మంది మత్స్యకారుల ఎదురుచూపు
- పట్టించుకోని ప్రభుత్వం



ఎండకు ఎండుతున్న వలలను చూపిస్తున్న మత్స్యకారుడు



చింతల వాగులో నిలిపి ఉంచిన బోట్లు

తాళ్లపాలెం(మచిలీపట్నంరూరల్): సరైన వసతులు కరువై తీర ప్రాంతంలోని మత్స్యకారులు నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం వాటిని విస్మరించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాళ్లపాలెం గ్రామంలోని మత్స్యకారులు సముద్రపు ఆటుపోటులను ఎదుర్కొంటూ బతుకులీడుస్తున్నారు. నడి సముద్రంలోకి బోట్లు సాయంతో వెళ్లి వల విసిరితే గానీ పూట గడవని మత్స్యకారులకు సదుపాయాలు లేమి తీవ్ర ఇబ్బందులకు గురిజేస్తోంది. తాళ్లపాలెం పంచాయతీలో 1600 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వీరి ప్రధాన వృత్తి చేపల వేట. ఎక్కువ శాతం మంది సముద్రంలో చేపల వేటకు వెళతారు. వేటకు వెళ్లి పట్టిన చేపలు అమ్ముకోవడం ద్వారా వీరి జీవనం సాగుతుంది. వీరిపై ఆధారపడి 4000 మంది కుటుంబ సభ్యులు ఉంటారు. ఒకసారి సముద్రంలోకి చేపల వేటకు వెళితే మూడు, నాలుగు రోజులు గడపాల్సి ఉంటుంది.

ప్లాట్‌ఫాం ఏర్పాటుచేస్తే ప్రయోజనం..

చేపల వేటకు వెళ్లి వచ్చిన తర్వాత చేపలను దింపుకోవడానికి ఈ ప్రాంతంలో ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగంగా ఉంటుందని మత్స్యకారులు అంటున్నారు. అలాగే వలలను ఎండ నుంచి కాపాడుకోవడానికి షెడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లైట్లు, సీసీ కెమెరాలు కూడా ప్రభుత్వం సమకూర్చాలని విన్నవిస్తున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బోట్లకు, వలలకు కొంతమేర రక్షణగా ఉంటుందని అంటున్నారు. కొన్ని సందర్భాల్లో బోట్లలోని డీజిల్ దొంగలు చోరీ చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం 50 శాతం రాయితీతో డీజిల్ సరఫరా చేయాలని కోరారు.

నిషేధ సమయంలో ఇక్కట్లే...

ఈ నెల 15వ తేదీ నుంచి రెండు నెలల పాటు వేట ఆపేస్తామని ఈ రెండు నెలలు కుటుంబాలను పోషించుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు కలుగుతాయన్నారు. గత ప్రభుత్వం మత్స్యకార భరోసాను మే నెలలో వేసేవారని దాని ద్వారా కుటుంబ పోషణకు చాలా ఉపయోగపడేవని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మత్స్యకారులకు కుటుంబానికి రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల వాగ్దానాలు చేశారని తెలిపారు. వేట ఆపే సమయానికి ఆ పథకాన్ని అమలు చేస్తే చాలా ఆసరాగా ఉంటుందని చెబుతున్నారు.



లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఈ ప్రాంతంలో లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వేటకు వెళ్లి వచ్చే సమయానికి ద్విచక్ర వాహనాలు దొంగతనానికి గురవుతున్నాయని ప్రాణాలకు తెగించి సముద్రంలో వేటకు వెళ్లి వాహనాలు, డీజిల్, వలలను దొంగలు ఎత్తుకుపోతుంటే చాలా బాధగా ఉంటుంది. వేటకు వెళ్లి వచ్చిన తర్వాత బోట్లను ఈ ప్రాంతంలో కట్టేసి ఇళ్లకు వెళ్లిపోతాం. బోట్లలో దొంగతనం జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి.

–దశరథ, మత్స్యకారుడు



సబ్సిడీతో డీజిల్ అందించాలి

ప్రభుత్వం 50 శాతం రాయితీపై డీజిల్ అందించాలి. వేటకు వెళ్లే మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు ఉచితంగా అందించాలి. ఈ ప్రాంతంలో ఫ్లాట్‌ఫారం, వలలు భద్రపరుచుకోవడానికి షెడ్లు నిర్మించాలి. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు హామీ ఇచ్చిన విధంగా కుటుంబానికి రూ. 20 వేలు చొప్పున తక్షణం విడుదల చేయాలి.

–బొమ్మిడి హరీష్, మత్స్యకారుడు

11న కలెక్టరేట్ వద్ద బీసీ సమరభేరి

మచిలీపట్నంటౌన్: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో బలహీన వర్గాల వారికి 52 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద నిర్వహించ తలపెట్టిన బీసీ సమరభేరి కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాత్మా జోతీరావుపూలే జయంతి సందర్భంగా పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపులో భాగంగా బీసీ సమరభేరి నిర్వహిస్తున్నామని చెప్పారు. 11వ తేదీ జ్యోతిరావుపూలే, 14న భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతుల సందర్భంగా జిల్లాలో మద్యం దుకాణాలు తెరవకుండా జిల్లా కలెక్టర్, ఎస్పీలు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఎస్.బాలాజీ, నాగేశ్వరరావు, కొడాలి దేవ, కార్తీక్, వంగలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ

పెడన: మండల పరిధిలోని బలిపర్రు గ్రామ పంట పొలాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు మట్టి నమూనాలు సేకరించారు. ఏఓ నూరున్నీసా పర్యవేక్షణలో వ్యవసాయ సహాయకులు రైతులతో కలసి నమూనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ సంవత్సరం మండల పరిధిలోని 18 రైతు సేవా కేంద్రాల ద్వారా 1172 మట్టి నమూనాలు సేకరించాలని నిర్ణయించామని చెప్పారు. జూన్ నాటికి ల్యాబ్ నుంచి ఫలితాలు రాగానే రైతులు వచ్చే సార్వాలో వినియోగించాల్సిన ఎరువులపై అవగాహన కలిగిస్తామన్నారు.

పిల్లల ఎదుగుదలకు జాగ్రత్తలు తప్పనిసరి



పోషణ్ పట్వాడా కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు, తల్లులు



మునిపెడలో ర్యాలీ చేస్తున్న చిన్నారులతో అధికారులు

చల్లపల్లి: తల్లి గర్భం దాల్చిన దగ్గర నుంచి బిడ్డ సంరక్షణా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూపర్ వైజర్ సీహెచ్ ఆదిలక్ష్మి తెలిపారు. నారాయణరావు నగర్‌లోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పట్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన దగ్గర నుంచి ప్రసవించే వరకూ ఆ తరువాత మరో రెండేళ్లు మొత్తం 1000 రోజులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత వంటి అంశాల గురించి వివరించారు. మహిళా పోలీస్ సైకం నాగలక్ష్మి, ఆశ వర్కర్ సీతారావమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.కె. ముంతాజ్ బేగం, లలిత పాల్గొన్నారు.

కృత్తివెన్ను:అమ్మతనం యొక్క కమ్మదనాన్ని ఆస్వాదించాలన్నా పుట్టిన శిశువు ఆరోగ్యంగా ఉండాలన్నా స్త్రీ తను గర్భం దాల్చిన నాటి నుంచి మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ గౌరీశ్యామల అన్నారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మునిపెడ దళితవాడ, ఇంతేరు తదితర గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీల కార్యకర్తలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

గూడూరు:మండల పరిధిలోని కంచాకోడూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషన్ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహార ప్రాముఖ్యతను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జన్ను రేవతి వివరించారు. కటకం నాగమల్లేశ్వరరావు, దూడల శివశంకర్, కొల్ల గౌరీ శంకర్, ఏడుకొండలు, కార్తీక్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: వెయ్యి రోజుల ప్రణాళిక అమలుపై గర్భిణులు, బాలింతలు అవగాహన కల్గి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి అన్నారు. ఘంటసాల మండలం, లంకపల్లి అంగన్‌వాడీ-2 కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త ఏ.సుభాషిణి, ఆయా సురేఖ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. ఘంటసాల మండలంలోని 59 అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సూపర్‌వైజర్ రమా నాగమణి తెలిపారు.

గందరగోళం మధ్య ఇంటర్వ్యూలు



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

బంటుమిల్లి: సబ్సిడీ రుణాల కోసం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలు గందరగోళం మధ్య ముగిశాయి. మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలకు పలు కార్పొరేషన్ల ద్వారా 82 యూనిట్లు మంజూరయ్యాయి. దీని కోసం 815 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. వీటి కోసం ఉదయం ఎంపీడీఓ శైలజకుమారి పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు ప్రారంభించి బ్యాంకులవారీగా దరఖాస్తుదారులను పిలిచారు. అయితే వారు ఒక్కసారిగా నెట్టుకుని గదిలోకి రావడంతో గందరగోళం నెలకొంది. ఈ స్థితిలో అసహనానికి గురైన ఎంపీడీఓ తానే స్వయంగా దరఖాస్తుదారులను మందలించి వరుస క్రమంలో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో ఆమె అర్జీదారుల వద్దకు వెళ్లి స్వయంగా స్లిప్పులు, దరఖాస్తులు తీసుకుని బ్యాంకు అధికారులకు అప్పగించారు. దరఖాస్తుదారులు ఇబ్బందులు పడకుండా పంచాయతీల వారీగా విచారించి స్లిప్పులు ఇచ్చేందుకు ఎంపీడీఓ ఏర్పాట్లు చేసినా గందరగోళం తప్పలేదు. ఒక స్థితిలో పోలీసులను పిలవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఆమె మాట్లాడుతూ ఇంటర్వ్యూకు హాజరైన 573 మంది దరఖాస్తులు పరిశీలించి అర్హులైన వారిని గుర్తిస్తామన్నారు. ఎంపీపీ వి. చిన బాబు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం, ద్వారకాతిరుమల ఆర్టీసీ సర్వీసుల్లో మార్పులు

అవనిగడ్డ: ఆర్టీసీ డిపో నుంచి నరసాపురం, ద్వారకాతిరుమలకు నడుపుతున్న సర్వీసుల్లో కొన్ని మార్పులు చేసినట్టు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. నాగాయలంక నుంచి నరసాపురం నడుపుతున్న ఆర్టీసీ సర్వీసుని గురువారం నుంచి మచిలీపట్నం, బంటుమిల్లి, కృత్తివెన్ను, పల్లెపాలెం, లోసరి, భీమవరం మీదుగా నడుపుతున్నట్టు చెప్పారు. ద్వారకా తిరుమలకు నడుపుతున్న సర్వీసుని గురువారం నుంచి ఉదయం 11 గంటలకు వెళ్ళేలా మార్పు చేసినట్టు డీఎం తెలిపారు.

ల్యాప్‌టాప్ అందజేత

అవనిగడ్డ: సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంకు పారిశ్రామికవేత్త అప్పికట్ల అప్పారావు ద్వారా ల్యాప్ టాప్‌ని సీఐ యువకుమార్‌కు అందజేశారు. అప్పారావు సోదరుడు వీరాంజనేయులు బుధవారం ల్యాప్‌టాప్‌ని అందించారు.

రెవెన్యూ సేవలపై అధిక మొత్తం వసూలు చేస్తే చర్యలు

చల్లపల్లి: మండలంలోని మీసేవా, సచివాలయ కేంద్రాల్లో రెవెన్యూ సర్వీసుల కోసం నిర్దేశించిన మొత్తాన్ని మాత్రమే వసూలు చేయాలని అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డి.వనజాక్షి హెచ్చరించారు. వివిధ రెవెన్యూ సర్వీసులకు సంబంధించి ఎంతెంత మొత్తం వసూలు చేయాలనే దానిపై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాని ప్రకారం పట్టాదారు పాసుపుస్తకం కోసం రూ.150, డూప్లికేట్ పట్టాదారు పాస్‌బుక్ రూ.150, అడంగల్ సవరణకు రూ.50, అడంగల్ సవరణ (పట్టాదార్ పాస్ బుక్‌తో కలిపి) రూ.150, భూమి సర్వే (ఎఫ్-లైన్)కు రూ.550, ఆర్ఓఆర్-ఐబికి రూ.40, కంప్యూటర్ అడంగల్‌కి రూ.40, ఆన్‌లైన్ పట్టా సబ్‌డివిజన్‌కు రూ.550, పట్టాదార్ ఆధార్ సీడింగ్‌కు రూ.50, వ్యవసాయ ఆధార ధ్రువీకరణ పత్రం కోసం రూ.50, నివేశన స్థల ధ్రువీకరణ పత్రం, కుల, ఆదాయ, వ్యవసాయ ఆదాయ, ఓబీసీ, ఇడబ్ల్యుఎస్, వ్యవసాయేతర భూమి మార్పు కోసం (నాలా) వాటికి ఒక్కొక్క దానికి రూ.50 చొప్పున రేటు నిర్దేశించామన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



బంటుమిల్లి అంబేద్కర్ సెంటర్లో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి వినియోగదారులపై భారాలు మోపిందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఎన్‌డీఓ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుంటే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆయిల్ ధరలు తగ్గించకపోగా గ్యాస్ ధరను 50 రూపాయలకు పెంచి వినియోగదారులపై భారం మోపిందని విమర్శించారు. సీపీఎం, రైతు సంఘాల నాయకులు ఎం. శ్రీనివాసరావు, జీ. నాగేశ్వరరావు, నాగరాజు, ఎల్. అజయ్‌ఘోష్, పి. వెంకన్న తదితరులున్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని ఆందోళన

మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దుచేసి, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలకు అనుగుణంగా ధరలు తగ్గించాలని సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై పెంచిన రూ. 50 వ్యతిరేకిస్తూ కోనేరు సెంటర్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముడి చమురు ధర పడిపోయినా గ్యాస్ ధర పెంచడం దారుణమన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ, సీపీఎం నగర కమిటీ సభ్యులు జయరావు, టి. చంద్రపాల్, ఎండీ యూనస్, తమ్ము చాందిని దుర్గ, సీపీఎం సీనియర్ నాయకులు ఎస్. ధనుంజయరావు, ఐద్వా నగర అధ్యక్షులు సీహెచ్ విజయలక్ష్మి, ప్రజానాట్య మండలి నగర కార్యదర్శి తమ్ము యువ కిషోర్, ఈడే రామారావు, డి. సత్యనారాయణ, వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్ ఆదర్శంతో ముందుకు సాగాలి

ఘంటసాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయంతో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని మచిలీపట్నం యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ కె.వెంకట్రావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఘంటసాల మండలం శ్రీకాకుళం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి కార్యక్రమంలో భాగంగా రూ.40 వేలు విలువైన ఇన్వర్టర్, వాటర్ ప్యూరిఫైయర్, 20 కుర్చీలను బుధవారం సాయంత్రం వార్డెన్ పీతల జ్ఞాన సుందరి సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా రీజనల్ హెడ్ వెంకట్రావు, డెప్యూటీ హెడ్ కె.రామలింగారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మచిలీపట్నం రీజనల్ కార్యదర్శి జి.శేషగిరిరావు, అధ్యక్షుడు ఎల్.ధనరాజు, మాజీ సర్పంచ్ మునిపల్లి బుజ్జి, ప్రముఖులు కుంపటి చిట్టిబాబు, రాచూరి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ఎంతో విశిష్టమైనది

ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సుధాకర్‌బాబు



అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సుధాకర్‌బాబు, ఐసీఈయూ నాయకులు

మచిలీపట్నంటౌన్: ప్రపంచ ప్రజాస్వామిక దేశాల్లో భారత రాజ్యాంగం ఎంతో విశిష్టమైనదని ఎల్ఐసీ మచిలీపట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్ బాబు తెలిపారు. అలాంటి గొప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి పౌరునిపై ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) డివిజన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం భారత రాజ్యాంగం – ఒక సజీవపత్రం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి సుధాకర్‌బాబు, ఐసీఈయూ నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన సుధాకర్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందులోని కీలకాంశాలను తెలియజేశారు. అనేక దేశాల రాజ్యాంగాలు అధ్యయనం చేసి, మన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా భారత రాజ్యాంగం రూపొందించబడిందని చెప్పారు. ఐసీఈయు డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్ మాట్లాడారు. ఐసీఈయూ అధ్యక్షుడు జె.సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఐసిఆర్ఇఎ నాయకులు పి.నాగయ్య, క్లాస్ -1 ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు రజనీకాంత్, ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు ఉమామహేశ్వరరావు, ఎల్ఐసీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కె.బుల్లయ్య, ఎల్ఐసీ ఓబీసీ అసోసియేషన్ నాయకులు ఏవీవీ ప్రసాద్, లియాఫీ ఏజెంట్స్ యూనియన్ నాయకులు సన్నాల రఘు, ఏఓఐ ఏజెంట్స్ యూనియన్ నాయకులు ఉదయలక్ష్మి, ఐసీఈయూ నాయకులు వై.స్వామినాథ్, డి.వాసు, ఎల్.రాజశేఖర్, ఎస్వీ రత్నారావు, బీహెచ్ మాధుర్, ఎల్ఐసీ ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు జీవితం నేటి యువతకు ఆదర్శం

చల్లపల్లి: కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చంద్ర రాజేశ్వరరావు జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఐ నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో బుధవారం 31వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంపన్న కుటుంబంలో పుట్టి ఉన్నదంతా ప్రజల కోసం త్యాగం చేసిన గొప్ప మహనీయులు చంద్ర అని కొనియాడారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, పార్టీ నాయకులు నరసింహారావు, జ్యోత్స్నదేవి తదితరులు పాల్గొన్నారు.

13న ఉచిత కంటి వైద్య శిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో 13న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో మారుతీ విద్యా నికేతన్ డిజిటల్ స్కూలు ఆవరణలో శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నేత్ర వైద్య పరీక్షలు, ఇతర వివరాల కోసం మొబైల్ నంబర్లు 9490636466, 7093617778 లో సంప్రదించి పేర్లు ముందుగా నమోదు చేసువాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీ

పెడన: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం పెడన పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రైల్వే గేటు నుంచి బంటుమిల్లి రోడ్డు, మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. రాష్ట్ర, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాదు, ఎన్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.